స్పందన గ్రీవెన్స్‌లో 439 అర్జీలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన గ్రీవెన్స్‌లో జిల్లా నలమూలల నుంచి వచ్చిన ప్రజలు 439 అర్జీలను అందజేశారు. వివిధ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ ఎమ్.గౌతమి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీ ఓపెన్ కేసులలో అర్జీదారులు సంతప్తి చెందేలా అధికారులు సమాధానమివ్వాలన్నారు. స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో 439 అర్జీలను ప్రజల నుంచి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, ట్రైనీ కలెక్టర్ కుశాల్ జైన్, డిఆర్ఓ గాయత్రి దేవి , అన్సెట్ సిఇఒ కేశవ నాయుడు, ఆర్డీవో మధుసూదన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అధికార పార్టీ నాయకులు కబ్జా చేయాలనుకుంటున్న స్థలం ఇదే..

అధికారం మాటున ఆక్రమణ..!

అనంతపురం జిల్లా కేంద్రానికి అనుకున్న ఉన్న బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో స్థలాలు ధరలు అధికంగా ఉన్నాయి. జిల్లా కేంద్రంతో సమానంగా ఇక్కడి స్థలాలకు ధరలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ భూములపై అధికార పార్టీ నేతలు కన్నేశారు. అధికారం ఉండగానే వాటిని కాజేయాలనే కుట్రలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌కు ఎదురుగా ఉన్న రూ.7 కోట్ల విలువజేసే 0.71 ఎకరాల ప్రభుత్వ భూమిని అధికార పార్టీ ముఖ్య నేతల బంధువులు కొట్టేసేలా పథకం రచించారు. అధికారులపై ఒత్తిళ్లు తెచ్చి ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకునేలా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ ముందు ఉన్న ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతోంది. ఇప్పటికే వంకలు, రోడ్లు ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదనే విమర్శలు ఉన్నాయి. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గి ఆక్రమణలకు సహకరిస్తున్నారనే వాదనా బలంగా విన్పిస్తోంది. ఇప్పటికే ఇందిరమ్మ కాలనీ, గాంధీనగర్‌లో రోడ్డును ఆక్రమించి కొందరు నిర్మాణాలు చేపట్టారు. తాజాగా పోలీసు స్టేషన్ ముందు ఉన్న ప్రభుత్వ స్థలం ఆక్రమణ చేసిన అధికార పార్టీ నాయకుని వియ్యంకుడు, అధికార పార్టీ నాయకుని అన్న ఇద్దరు ఈ స్థలాన్ని ఆక్రమించేలా ప్రణాళిక రచించారు. బుక్కరాయసముద్రం గ్రామ సర్వే నెంబరు 539-2, 540-2లో 0.71 ఎకరాలు ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో ఉంది. గతంలో ఈ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని సిపిఎం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టడంతో అధికారులు దానిని అసైన్డ్‌మెంట్ భూమిగా రికార్డుల్లో నమోదు చేశారు. ప్రస్తుతం ఈ భూమిని కాజేసేందుకు అధికార పార్టీ నాయకులు ఎత్తులు వేస్తున్నారు. ఇది ప్రభుత్వం స్థలం అని తెలిసేలా అధికారులు బోర్డులు ఏర్పాటు చేయాలని గతంలో ప్రజలు, ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేసినా అధికారులు ఆ మేరకు చర్యలు తీసుకోలేదు. దీంతో ప్రస్తుతం ఆ స్థలం ఆక్రమణ కోరల్లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. పోలీసు స్టేషన్ వద్ద స్థలాన్ని ఆక్రమిస్తున్నారన్న దానిపై పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నా రెవెన్యూ అధికారులు దీనిపై ఎలాంటి స్పందనా వెల్లబుచ్చడం లేదు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు

బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో ఇప్పటికే వంకను ఆక్రమించి పెద్ద భవనాలు వెలిశాయి. ఓ అధికార పార్టీ నాయకుడు ఏకంగా 5 మరుగుదొడ్లను నిర్మించాడు. రోడ్డును ఆక్రమించి అందులో బండలు, ఇతర వ్యాపార కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారు. ఇవన్నీ మండల రెవెన్యూ అధికారుల కళ్లెదుటే జరుగుతున్నా వారు మౌనంగా ఉంటుండడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కోట్ల విలువజేసే ప్రభుత్వ స్థలాలను కాపాడలేని నిస్సహాయ స్థితిలో అధికారులు ఉన్నారనే భావన ప్రజల్లో వ్యక్తం అవుతోంది.

- ◆ రూ.7 కోట్లు విలువజేసే ప్రభుత్వ స్థలం కొట్టేసే కుట్ర
- ◆ కబ్జా ప్రయత్నాలు జరుగుతున్నా స్పందించని 'రెవెన్యూ శాఖ'
- ◆ ఆక్రమణదారులకు అధికారులు సహకరిస్తున్నారనే విమర్శలు
- ◆ ప్రభుత్వ స్థలంలో బోర్డులు ఏర్పాటు చేయాలంటున్న సిపిఎం, ప్రజాసంఘాలు

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి

బుక్కరాయసముద్రం మండలం కేంద్రంలోని పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న సర్వే నంబరు 539-2, 540-2లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొందరు అధికారాన్ని అడ్డుపెట్టుకుని కబ్జా చేయాలని చూస్తున్నారు. రెవెన్యూ అధికారులు దీనిపై స్పందించాలి. ఆ స్థలం ప్రభుత్వ భూమి అని తెలిసేలా అందులో బోర్డు పెట్టాలి. మండల కేంద్రంలో ఇతర ప్రాంతాల్లో జరిగిన ప్రభుత్వ భూముల కబ్జాపైనే విచారణ చేపట్టి వాటిని స్వాధీనం చేసుకోవాలి.

ఆర్. కుల్లాయప్ప, సిపిఎం మండల కార్యదర్శి.

దొరికిందే కొంత.. రికవరీ పిసరంత..!

◆ ఉపాధి హామీ అవినీతి వసూలు మొక్కుబడే ◆ మూడున్నర శాతంలోపే రికవరీ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉపాధి హామీ పథకంలో ఎక్కడైనా అవకతవకలు జరిగితే పట్టుకుని నివారించేందుకు వీలుగా సామాజిక తనిఖీని నిర్వహిస్తారు. ఈ సామాజిక తనిఖీ చేపట్టే సమయంలోనూ అనేక రకాలైన ఒత్తిళ్లు వస్తూంటాయి. వీటన్నింటినీ అధిగమించి ఎంతోకొంతైనా ఉపాధి హామీలోని అక్రమాలు, అవకతవకలను గుర్తించడం జరుగుతుంది. ఇందులో నుంచి కూడా రికవరీ చేసేది మరీ పిసరంతగా ఉంటోంది. గుర్తించిన దాంట్లో నాలుగు శాతం కంటే తక్కువగానే రికవరీ ఉంటుండటం గమనార్హం.

జిల్లాల పునర్విభజన జరగక ముందు 2021-22వ సంవత్సరంలో 31.30 శాతం పంచాయతీల్లో సామాజిక తనిఖీలు జరిగాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో 1048 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిల్లో 328 పంచాయతీల్లో సామాజిక తనిఖీలు జరిగాయి. ఇందులో 6905 సమస్యలను గుర్తించారు. గుర్తించిన సమస్యల్లో 2070 మాత్రమే చర్యలు తీసుకున్నారు. అంటే 29.98 శాతంపై చర్యలున్నాయి. ఇక ఆర్థిక అంశాలకు వస్తే రూ.8.64 కోట్లు అవకతవకలు జరిగినట్టు సామాజిక తనిఖీల్లో తేలింది. ఇందులో నుంచి తిరిగి రికవరీ చేసింది కేవలం రూ.29.31 లక్షలు మాత్రమే. అంటే కేవలం 3.39 శాతం మాత్రమే రికవరీ ఉంది. ఇక ఆర్థిక చెల్లింపుల్లో నిబంధనలు పాటించనవి చూస్తే రూ.16.35 కోట్లు ఉన్నాయి. వీటిని ఏ మేరకు సరిచేసారన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. ఈ మొత్తం వ్యవహారంలో ఇద్దరిపై ఎఫ్ఐఆర్‌లు నమోదవగా, 53 మందికి జరిమానాలు విధించారు. 56 మందిపై శాఖపరమైన చర్యలకు ఉపక్రమించారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి వచ్చే సరికి రెండు జిల్లాలుగా ఉంది. అనంతపురం జిల్లా వరకు చూస్తే 577 పంచాయతీలున్నాయి. వీటిల్లో 577 పంచాయతీల్లోనూ అడిట్ జరిగింది. 4211 సమస్యలను గుర్తించారు. 89వాటిపై మాత్రమే చర్యలున్నాయి. అంటే రెండు శాతం వాటిపై కూడా చర్యల్లేవు. రూ.2.27 కోట్లు అవినీతి జరిగినట్టు తేలింది. ఇందులో రూ8.73 లక్షలు వసూలు చేశారు. రూ.95.87 లక్షలు నిబంధనలకు విరుద్ధంగా నిధుల మళ్లింపులు జరిగాయి. ఇక సత్యసాయి జిల్లాకు వచ్చే సరికి 471 పంచాయతీలున్నాయి. అన్నింటిలోనూ సామాజిక తనిఖీ జరిగింది. రూ.81.49 లక్షలు అవినీతి జరిగినట్టు గుర్తించారు. ఇందులో రికవరీ చేసింది కేవలం రూ52,454 మాత్రమే. అంటే మొత్తంలో 0.28 శాతం మాత్రమే వసూలైంది. ఇక నిబంధనలకు విరుద్ధం జరిగిన చెల్లింపులు రూ.48.49 లక్షలయితే రూ.43,925 రికవరీ చేశారు. ఇలా సామాజిక తనిఖీల్లో అవకతవకలు బయటపడినా చర్యలు మొక్కుబడిగానే ఉంటున్నాయి.

చర్యలు తీసుకోవాలి

ఉపాధి హామీ పథకాన్ని కూలీలకు పనులు కల్పించే లక్ష్యంతో తీసుకొచ్చారు. ఇందులో అక్రమాలు ఏమైనా ఉంటే కట్టడి చేయడానికే సామాజిక తనిఖీని తీసుకొచ్చారు. ఇందులో గుర్తించిన వాటిపై అధికారులు చర్యలు తీసుకోవాలి. నిధుల దుర్వినియోగం అవకుండా కూలీలకు న్యాయం జరిగే విధంగా ఉంటుంది. అదే విధంగా డబ్బులు కాజేసిన వారి నుంచి రికవరీ చేయాలి.

కృష్ణమూర్తి,
ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి.

క్రీడలతోనే మానసికోల్లాసం

◆ సృజనాత్మకత పెంపొందించే క్రీడ చెస్ ◆ ప్రముఖ మానసిక వైద్య నిపుణులు ఎండ్లూరి ప్రభాకర్

చెస్ ఆడుతున్న క్రీడాకారులు

ప్రశంసాపత్రాలను అందుకుంటున్న చెస్ క్రీడాకారులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని, చెస్‌తో సృజనాత్మకత పెంపొందుతుందని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ తెలిపారు. విప్లవకారుడు చెగువేరా జయంతిని పురస్కరించుకుని ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, అనంతపురం చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెస్ పోటీలను సోమవారం నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాలలోని డ్రామా హాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు ఈ పోటీలు జరిగాయి. అండర్-7, 9, 11, 13, 15 విభాగాలతో పాటు ఓపెన్ కేటగిరిలో కూడా క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలు ముగిసిన అనంతరం సాయంత్రం డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలక్రిష్ణ అధ్యక్షతన చెస్ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ మానసిక వైద్య నిపుణులు ఎండ్లూరి ప్రభాకర్ ఇతర అతిథులతో కలిసి బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెగువేరా విప్లవానికి మార్గదర్శకుడని, సమాజాభివృద్ధికి జీవితాలను త్యాగచేసిన ఆదర్శవంతమైన వ్యక్తి అన్నారు. చెగువేరా వంటి ధైర్యశాలి, విప్లవవీరుడి గురించి నేటి సమాజం తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలకు చెగువేరా ప్రతిభా పాఠవాలు, తెగువ, సామాజిక దృక్పథం అలవర్చుకునేందుకు చక్కటి అవకాశం అన్నారు. టివీ, మొబైల్ ఫోన్‌లు, సినిమా నాలెడ్జ్‌తో మెదడు నింపుతున్న పిల్లలకు చెగువేరా వంటి జీవిత విశేషాలన్ని తెలుసుకునేలా ప్రోత్సహించాలన్నారు. చెగువేరా జయంతి సందర్భంగా చెస్ పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. పోటీలలో పాల్గొన్న క్రీడాకారులకు ప్రశంస పత్రం, గెలిచిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సాయి సేవా సంస్థ విజయ సాయికుమార్, డాక్టర్ సుప్రజ, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి, జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, లక్ష్మి, అనంత చిల్డ్రన్స్ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్, చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఉదయ్ కుమార్, ఆర్బిటర్‌లు మల్లికార్జున, కోర్డినేటర్ గోవిందు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్దకు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన రైతు అహోబిలేసు

కలెక్టరేట్‌లో రైతు ఆత్మహత్యాయత్నం

పోలీసుల చాకచక్యంతో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

తన సమస్య పరిష్కరించడంలో రెవెన్యూ, సర్వే, భూరికార్డుల శాఖ అధికారులు జాప్యం చేస్తున్నారంటూ మనస్తాపం చెందిన రైతు అనంతపరం కలెక్టరేట్‌లో ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. యాడికి మండలం, నగరూరు గ్రామానికి చెందిన రైతు అహోబిలేసు కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన స్పందన గ్రీవెన్స్‌సెల్‌కు సోమవారం ఉదయం వచ్చాడు. అప్పటికే జిల్లా నలుమూలల నుంచి ఫిర్యాదుదారుల నుంచి కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ ఇతర అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. సదరు రైతు అర్జీ ఇవ్వకుండా కలెక్టరేట్ ఆవరణంలో ఓ మూలన చెట్టుపై ఎక్కి ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించాడు. చెట్టు కింద తన భార్య పిల్లలు రోదన అరుపులు చేయడంతో అటుగా వెళ్లిన వారు గమనించి పోలీసులకు తెలిపారు. కలెక్టరేట్ బీట్ పోలీస్ భగీరథ పరుగులు తీసి ఆ వ్యక్తి ఉన్న చోటుకు వెళ్లాడు. అప్పటికే సదరు రైతు చెట్టు ఎక్కి తాళ్లు సిద్ధం చేసుకుంటున్నాడు. నీ సమస్య పరిష్కరిస్తారు దిగాలంటూ విజ్ఞప్తి చేశారు. దీంతో రైతు కిందకు దిగాడు. పోలీసులు ఆ రైతును జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ వద్దకు తీసుకెళ్లారు. దీంతో రైతు అహోబిలేసు కిందకు దిగి తన సమస్య చెప్పుకొచ్చాడు. 462 సర్వే నెంబర్‌లో 7.48 ఎకరాల సాగు భూమి ఉందని, తన పొలానికి పక్క పొలానికి గట్టు ఉందన్నారు. గట్టుపై చెట్లు పెద్దగా పెరిగి నీడలా ఏర్పడటంతో పంటలు దెబ్బతింటున్నాయని, ఆ చెట్లు తొలగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆ చెట్లు తనకు చెందుతాయా, లేక పక్క పొలం వారికి చెందుతాయో తేల్చాలంటూ మండల రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులకు అనేక మార్లు అర్జీలు, విజ్ఞప్తులు చేశానన్నారు. అయితే అధికారులు సమస్య పరిష్కరించడం లేదని, విసిగు చెంది ఆత్మహత్య యత్నం చేసినట్లు తెలిపారు. స్పందించిన జేసి సర్వే శాఖ ఏడీని పిలిపించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

కుందుర్పి తహశీల్దార్ కార్యాలయంపై ఎగురుతున్న వైసిపి జెండా

తహశీల్దార్ కార్యాలయంపై

వైసిపి జెండా

కుందుర్పిలో ఘటన

కుందుర్పి మండలంలో జనం విస్తుపోయే ఘటన చోటు చేసుకుంది. రాజకీయ పార్టీలకు అతీతంగా ఉండాల్సిన ప్రభుత్వ కార్యాలయంపై ఏకంగా అధికార వైసిపి జెండా ఎగిరింది. దాదాపు ఒకరోజంతా ఈ జెండా కార్యాలయంపై ఉంది. ప్రభుత్వ కార్యాలయంపై వైసిపి జెండా ఎగరడం ఏమిటంటూ పలువురు విస్మయం వ్యక్తం చేశారు. ఇది ఆకతాయిలు చేసిన పనా.? లేక ఎవరైన రాజకీయ ఉద్దేశంతో చేశారా.? అన్న కోణంలో అధికారులు విచారణ చేస్తున్నారు.

వార్త జనరల్‌లో..

ఉద్యోగాలు ఎక్కడ...!

'గడప గడపకూ'లో మహిళ నిలదీత... ఎమ్మెల్యే వైవిఆర్ ఆగ్రహం

ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని నిలదీస్తున్న మహిళ

ప్రజాశక్తి-గుత్తి

'ఎక్కడున్నాయి నీ కొడుకులకు ఉద్యోగాలిచ్చేందుకు..ఉంటే కదా ఇచ్చేందుకు..' అంటూ ఓ మహిళపై ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం మండలంలోని ఊబిచెర్ల గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలపై ఏకరువు పెట్టారు. ముఖ్యంగా గ్రామానికి చెందిన రంగమ్మ 'సారూ.. నేను కూలికి వెళ్తే రూ.200 మాత్రమే వస్తుంది.. దీంతో నా కుటుంబం గడవడం కూడా కష్టంగా ఉంది.. మాకేమైనా న్యాయం చేయండి.. నా కొడుకులకు ఉద్యోగాలు ఇప్పించి ఆదుకోండి' అంటూ అంటూ ఎమ్మెల్యేను నిలదీసింది. ఇందుకు ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'యాడ ఉన్నాయ్.. ఉద్యోగాలు.. ఉంటే కదా ఇచ్చేకి.. ఉద్యోగాల్లేవు..గిద్యోగాల్లేవు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇందుకు ప్రతిస్పందనగా మహిళ 'ఎందుకు సార్ అలా అంటావ్.. మేము ఎంతో కష్టపడ్డాం.. కనీసం కసువు ఊడ్చే పని అయినా కల్పించండి..' అంటుండగా నిర్లక్ష్యంగా ముందుకు సాగడం బాధాకరం. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం పథకాలపై వివరించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జి.విశాలాక్షి, గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతీరెడ్డి, సర్పంచి చిదంబరి, వైసిపి సీనియర్ నాయకులు బి.శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రామ రంగారెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

◆ ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం ◆ కలెక్టర్ ఎం.గౌతమి

పర్యావరణ పరిరక్షణ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎమ్.గౌతమి, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, పర్యావరణ పరిరక్షణకు అందరూ బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాలుష్య నియంత్రణ మండలి, అటవీశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం జిల్లాలో వివిధ శాఖలా అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు, ప్రజలు, విద్యార్థులు అనంతపురం తెలుగు తల్లి విగ్రహం కూడలిలో ఉదయం ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని కలెక్టర్, అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ అనంతరం కృష్ణ కళామందిరం ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలు మానవాలి మనుగడకు జీవాధారం అన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలన్నారు. మనం భవిష్యత్తు తరాలకు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందించాలన్నారు. ప్లాస్టిక్ రహిత వస్తువులు వినియోగించే విధంగా చైతన్యం తీసుకురావాలని అన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో కాలుష్య వాతావరణం వల్ల మానవ మనుగడకు, సమస్త జీవకోటికి ఎంతో ప్రమాదం అన్నారు. అనంతపురం కార్పొరేషన్ పరిధిలో 9 కిలోమీటర్లు చెట్లునాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ సందీప్ కృపాకర్, పొల్యూషన్ బోర్డ్ ఇఇ శంకర్రావు, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘం నాయకుడు సూర్యనారాయణపై వేధింపులు తగదు

ప్రజాశక్తి-అనంతపురం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు సూర్యనారాయణపై ప్రభుత్వం అనుసరిస్తున్న కక్ష సాధింపు చర్యలను వాణిజ్య పన్నుల శాఖ సర్వీసెస్ ఉద్యోగ సంఘం అనంతపురం డివిజన్ కమిటీ ఖండించింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతిరామ్, బి.ఆంజినేయులు సోమవారం నాడు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగుల సమస్యలపై పోరాడుతున్న సూర్యనారాయణపై ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. సూర్యనారాయణ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ 1996 నుంచి వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం 2016 విజయవాడ ప్రధాన కార్యలయంలో ఉద్యోగిగా పనిచేశారని పేర్కొన్నారు. విధుల్లో ఉంటూ విజయవాడ కార్యాలయానికి ఏ మాత్రం సంబంధం లేకుండా విధులకు సూర్యనారాయణ దూరంగా ఉంటున్నారని తెలిపారు. అటువంటి వ్యక్తిపై కావాలనే సూర్యనారాయణను ఏదోక కేసులో ఇరికించి, ఆయనపై దుష్ప్రచారం చేస్తోందని తెలిపారు. ఇటువంటి చర్యలను ప్రభుత్వం మానుకోవాలన్నారు. సమస్యలపై పోరాడే హక్కు ఉద్యోగులు, ఉద్యోగ సంఘం నేతలకు ఉంటుందన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఉద్యోగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

రాయదుర్గంలో అభివృద్ధి ఎక్కడ..?

విప్ 'కాపు'నకు మాజీమంత్రి కాలవ సెల్ఫీ ఛాలెంజ్

సెల్ఫీ తీసుకుంటున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

కాపు రామచంద్రారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి తనను ఆడిపోసుకోవడం తప్ప అభివృద్ధి చేసింది శూన్యమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు విమర్శించారు. సెల్ఫీ ఛాలెంజ్‌లో భాగంగా టిడిపి హయాంలో నిర్మించిన జాతీయ రహదారిపై సోమవారం సెల్ఫీ వీడియో తీసుకుని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత మారుమూల ఉన్న రాయదుర్గాన్ని జాతీయ రహదారుల చిత్రపటంలో నిలిపామన్నారు. తన పట్టుదల, చంద్రబాబు ఆశీస్సుల వల్ల హనగల్ నుంచి అనంతపురం వరకూ ఎన్‌హెచ్-544 డిడి పేరుతో రూ.549 కోట్లతో రహదారి నిర్మాణం చేశామన్నారు. అలాగే బళ్లారి నుంచి ఉరవకొండ మీదుగా అనంతపురం దాకా జాతీయ రహదారి ఉన్నందున సమీపంలో మరొకటి సాధ్యపడదని కేంద్రం మొదట్లో ఈ ప్రతిపాదనను ఒప్పుకోలేదన్నారు. అయితే కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని ఒప్పించి రహదారిని మంజూరు చేయించిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. రాయదుర్గం నుంచి గార్మెంట్స్ ఉత్పత్తులను దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేయడానికి ఈ రహదారి ఎంతో ఉపయోగపడుతోందన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కాపు రామచంద్రారెడ్డి ప్రజలకు పనికొచ్చే ఇలాంటి శాశ్వత పని ఒక్కటైనా చేశారా.. అని ప్రశ్నించారు. అభివృద్ధి చేతగాని కాపు పశు భాషలో తనను విమర్శిస్తూ ఉంటాడన్నారు. కాపు రామచంద్రారెడ్డి ఇప్పటికైనా ఒల్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని, లేనిపక్షంలో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

నివారణ పక్షోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

ఆత్మకూరులో పక్షోత్సవాల పోస్టర్లను విడుదల చేస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-ఉరవకొండ

అతిసార వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్‌నాయక్ సూచించారు. అతిసార వ్యాధి వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు అతిసార వ్యాధి ఎక్కువగా సోకే అవకాశం ఉందన్నారు. అతిసార వ్యాధిని నివారించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 5వ తేదీ నుంచి 17వ తేదీ వరకు అతిసార వ్యాధి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున ఈ పదిహేను రోజులు ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని ఐదేళ్లలోపు పిల్లలున్న ఇళ్లను సందర్శించి వివరాలు సేకరించడంతోపాటు ఒఆర్ఎస్ పాకెట్లు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నాగరంగయ్య,హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ, సూపర్‌వైజర్ శేఖర్, సీఓ భగవాన్‌దాస్, స్టాఫ్ నర్సులు సరస్వతి, సునీత, జినతున్నీసా, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : ఉధృత అతిసార పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని ఆత్మకూరు ఆరోగ్య కేంద్రంలో గోడప్రతులు విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి దయాకర్ మాట్లాడుతూ కలుషిత నీరు ఆహారం వల్ల ఎక్కువగా విరేచనాలు అయ్యే ప్రమాదం ఉందన్నారు. విరేచనాలు అయినప్పుడు దేహంలో నీరు, లవణాలు పోయి నీరసం వచ్చి సొమ్మసిల్లి పోయే అవకాశం ఉందన్నారు. అలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని ఎఎన్ఎం లేదా ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి ఒఆర్ఎస్ ప్యాకెట్లను తీసుకుని తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ నాగేశ్వరయ్య, మునాఫ్, సిహెచ్ఒ చంద్రావతి, పిహెచ్ఎన్.తులసమ్మ, సూపర్‌వైజర్ వెంకటరత్నమ్మ, ఒపి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'డిపిఎస్'లో క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యావిధానం

ఢిల్లీ పబ్లిక్ పాఠశాల (ఇన్‌సెట్‌లో) కరస్పాంటెండెంట్ ఎవి.ప్రతాప్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో ఆధునిక హంగులతో క్రమశిక్షణ, విద్యా విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ఢిల్లీ పబ్లిక్ పాఠశాలను స్థాపించామని డిపిఎస్ ఫ్రాంచైజిదారులు ఎ.వి.ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతు ప్రపంచవ్యాప్తంగా డిపిఎస్‌కు ఎంతో గుర్తింపు ఉందన్నారు. ఉన్నతమైన విద్యావిలువలను పరిచయం చేయాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నామన్నారు. పదెకరాల సువిశాలమైన ప్రాంగణంలో అన్నిరకాల వసతులతో పాఠశాలను తీర్చిదిద్దినట్లు తెలిపారు. అంతేగాకుండా నిష్ణాతులైన వివిధ ప్రాంతాలకు చెందిన ఉపాధ్యాయులు, చదువుతోపాటుగా క్రీడలు, పోటీ పరీక్షలకు అత్యున్నత స్థాయి విధివిధానాలతో ముందుకు తీసుకెళ్లే సిబ్బంది ఉన్నారన్నారు. ప్రస్తుతం నర్సరీ నుంచి 9వ తరగతి వరకు డేస్కాలర్స్, సెమి రెసిడెన్సియల్, రెసిడెన్సియల్ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. 1993 లో విద్యారంగంలో అడుగుపెట్టిన తాము విద్యారంగంలో ఎనలేని సేవలను అందించినట్లు చెప్పారు. అంతే ఆప్యాయతతో అనంత ప్రజలు ఆదరించారన్నారు. వారి ఆదరణతో ఇంటెల్ ఇంజనీరింగ్, మౌళాలి, ఎస్‌కెడి కళాశాలలు రాష్ట్ర, రాయలసీమ స్థాయిలో గొప్ప ఖ్యాతిని గడించాయన్నారు. ప్రస్తుతం డిపిఎస్ విద్యాసంస్థ విద్యార్థులకు సిబిఎస్ఇ, స్టేట్ బోర్డు సిలబస్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల నైపుణ్యతను దృష్టిలో ఉంచుకుని చదువుతో పాటు క్రికెట్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, ఫెన్సింగ్, ఆర్చరీ వంటి ఆటలలో శిక్షణను అందిస్తున్నట్లు చెప్పారు.

రీసర్వే కిట్లు అందజేత

అనంతపురం కలెక్టరేట్ : రీ సర్వేలో భాగంగా జగనన్న భూ శాశ్వత హక్కు భూ రక్ష పథకం ద్వారా ప్రతి అనువుని కొలిచి హద్దులు నిర్ణయించి భూహక్కు పట్టా ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ ఎమ్.గౌతమి తెలిపారు. రీ సర్వేలో పాల్గొనే గ్రామ సర్వేయర్‌కు రీసర్వే కిట్ ల్యాప్ టాప్, ఒక బ్యాగు, వాటర్ బాటిల్, క్యాలిక్యులేటర్, పెన్నులు, పేపర్ బండల్స్, మొదలగు ఇతర సామగ్రి కిట్లను సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో అందజేశారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆమె సూచించారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని దివ్యాంగుల వినతి

గుత్తి : ఇంటి స్థలాలు కేటాయించాలని కోరుతూ తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషాకు పలువురు దివ్యాంగులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వికలాంగుల సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు చక్రాల దేవికుమార్ మాట్లాడుతూ 15 ఏళ్ల క్రితం సర్వే నంబర్ 515.సిలో మండలంలోని 104 మంది దివ్యాంగులకు రెవెన్యూ అధికారులు ఇంటి పట్టాలిచ్చారన్నారు. అయితే తమ వద్ద డబ్బు లేక గృహాలు నిర్మించుకోలేకపోయామన్నారు. దీంతో ఇటీవల రెవెన్యూ అధికారులు ఇంటి పట్టాలను రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రభుత్వం పక్కా గృహాలు నిర్మించి జగనన్న కాలనీ ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు తహశీల్దార్ స్పందిస్తూ క్షేత్రస్థాయిలో విచారించి అర్హులందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల దివ్యాంగుల సంఘం నాయకులు శ్రీనివాసులు, దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు విన్నవిస్తున్న దివ్యాంగులు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి

నాయకులను సన్మానిస్తున్న మల్లాపురం వాసులు

ప్రజాశక్తి-ఉరవకొండ

గ్రామాల అభివృద్ధే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి అన్నారు. విడపనకల్ మండల పరిధిలోని పాల్తూరు పంచాయతీ గాజుల మల్లాపురం గ్రామంలో రూ.20 లక్షలతో క్యాంపు కాలనీలో ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్ల పనులకు సర్పంచి బ్యాలా రాణి రాజశేఖర్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి విశ్వేశ్వరరెడ్డి సహకారంతో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. అనంతరం గ్రామస్తులు ఎంపిపితోపాటు ఎంపిటిసి పాటిల్ శివకుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ఓబులేసు, వార్డు మెంబర్ శంకర్‌గౌడ్, కాంట్రాక్టర్ సుధాకర్‌రెడ్డి, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, రాజశేఖర్, ఉమాశంకర్, ప్రసాద్, హంపయ్య, సురేష్‌యాదవ్, షణ్ముఖ గౌడ్, పాటిల్ శివకుమార్ పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు సన్మానం

విడపనకల్ తహశీల్దార్ ఈరమ్మను ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ గోవిందరెడ్డి, గడేకల్ ఎంపిటిసి ఓబులేసు, సర్పంచి సుశీల ఉమాశంకర్, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, హంపయ్య, ప్రసాద్, సురేష్‌యాదవ్, మాల్యం ఎర్రన్న, లాలెప్ప, కొత్తకోట రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి : సిపిఎం

కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లురూరల్

మండల పరిధిలో ఉన్న 17వేల మంది కౌలురైతులను ఆదుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ బి.రాముకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు దాసరి శ్రీనివాసులు, భజంత్రీ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో 70 శాతం మంది రైతులు కౌలుకు చేస్తూ పెట్టుబడి గిట్టుబాటుగాక అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వాలు గుడ్డిగా భూస్వాముల వైపు నడిపిస్తూ అత్యధికంగా ఇన్సూరెన్స్ పథకాలు తీసుకొస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కౌలు రైతులను గుర్తించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.తిమ్మప్ప, జగ్గలి రమేష్, కసాపురం రమేష్, నాగరాజు, మల్లికార్జున, వెంకటేష్, చందు, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు మండల పరిధిలోని కసాపురం, సంగాల, దోసలోడికి గ్రామాల్లో సిపిఎం నాయకులు పర్యటించి కౌలురైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ నుండి కౌలు రైతుల సమస్యలపై జీపుజాత, పాదయాత్ర ప్రారంభ సభ, పాదయాత్ర ఉంటాయన్నారు. అదేవిధంగా ఈనెల 12న రాయబారంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో లక్షలాది మంది రైలు పాల్గొని మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.శ్రీనివాసులు, దాసరి శ్రీనివాసులు, సిఐటియు నాయకులు సాకే నాగరాజు, కసాపురం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కెబిఎన్ మెడికల్ దుకాణంపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం మండల కార్యదర్శి మధుసూదన్

తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

దొంగ సర్టిఫికెట్లతో కెఎన్ మెడికల్ జనరల్ స్టోర్ నిర్వహిస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి మధుసూదన్, జిల్లా కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ కెబిఎన్ మెడికల్ స్టోర్స్ నిర్వాహకులు మందులు కోసం వచ్చిన వారిపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా మందులు తీసుకున్న అనంతరం బిల్లులు ఇవ్వకుండా కేవలం తెల్లపేపర్లపై రాసి ఇస్తున్నారన్నారు. అంతేగాకుండా తక్కువ ధరల మందులను ఎక్కువ ధరలకు అమ్ముతున్నారని ఆరోపించారు. మందులు ఇవ్వాలంటే కనీసం ఫార్మాసిస్ట్ కోర్సు చేయాలన్నారు. అయితే ఎలాంటి చదువూ లేకుండా డాక్టర్ రాసిన ప్రిస్క్రిప్షన్ చూసి మందులు ఇస్తున్నారని వాపోయారు. వజ్రకరూర్ మండలంలో పనిచేస్తున్న ప్రభుత్వ వైద్యాధికారి కెబిఎన్ మెడికల్ స్టోర్‌కు సంబంధించి క్లిక్ నడుపుతున్నారన్నారు. అయితే డాక్టర్ లేని సమయంలో మెడికల్ షాపు నిర్వాహకులే రోగులకు ట్రీట్‌మెంట్ చేస్తూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. ఇవన్నీ తెలిసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కెబిఎన్ మెడికల్, జనరల్ స్టోర్‌పై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ షాబుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిద్ధప్ప, కె.వెంకటేశులు, సీనప్ప, రవికుమార్, రైతుసంఘం నాయకులు మురళి, వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కడదరబెంచి లైన్‌మెన్‌పై చర్యలు తీసుకోండి

ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన

ట్రాన్స్‌కో ఎఇకి వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్లు మండల పరిధిలోని కడదర బెంచి గ్రామంలో విధులు నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ లైన్‌మెన్ బాషాపై చర్యలు తీసుకోవాలని సర్పంచి దేవరాజ్, మార్కెట్ యార్డు డైరెక్టర్ రమేష్ ఆధ్వర్యంలో రైతులు మాలాపురంలోనే విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ లైన్‌మెన్ నిర్లక్ష్యం వల్ల విద్యుత్ తీగలు తెగి కింద పడటంతో గ్రామానికి చెందిన తాయప్ప కుమారుడు హరిజన లాలప్ప ఎద్దులు మృతిచెందాయన్నారు. ఫలితంగా బాధిత రైతులకు సుమారు రూ.లక్ష వరకూ నష్టం వాటిల్లిందన్నారు. ఆ రైతుకు నష్ట పరిహారం ఎవరు చెల్లిస్తారని నిలదీశారు. ఎస్సీ, బీసీ కాలనీలతోపాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు చేతికందే ఎత్తులో ఉన్నాయని పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. వెంటనే సంబంధిత లైన్‌మెన్‌పై చర్యలు తీసుకుని బాధిత రైతులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందుకు ఎఇ సత్యం స్పందిస్తూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి లైన్‌మెన్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. అంతేగాకుండా గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు రామాంజనేయులు, చిన్న పెద్దయ్య, ధను, చిన్న ఎర్రిస్వామి, గాదిలింగ లాలెప్ప, పెద్దయ్య, సిద్ధార్థ, పరశురాముడు, విజయ్‌కుమార్, రాము, గోవిందప్ప, వెంకటేశులు, బాషా, ముత్యాలు, ఉల్లిగన్న, అయ్యప్ప, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..

మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతురాయచౌదరి

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హనుమంతురాయచౌదరి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధిపై వైసిపి నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా అని మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి సవాల్ విసిరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం వైసిపి నిర్వహించిన విజయోత్సవ సభలో రూ.4,718 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. టిడిపి హయాంలో చేసిన అభివృద్ధిని తమ ఖాతాలో వేసుకుని ప్రజలను మభ్యపెట్టడం మంత్రి ఉషాశ్రీచరణ్‌కే చెల్లిందన్నారు. టిడిపి హయాంలో చేసిన అభివృద్ధిపై చర్చించేందుకు తాము ఎక్కిడికైనా వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కాగా టిడిపి అధినేత చంద్రబాబు ఇటీవల ప్రకటించిన మేనిఫెస్టోపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కర్నాటకను కాపీ కొట్టారని చెప్పడం 'దెయ్యాలు వేదాలు వల్లించినట్లు' ఉందన్నారు. వైసిపి నాయకులు ఇప్పటికైనా ఇలాంటి వ్యాఖ్యలు మానుకోవాలని, లేకుంటే ప్రజలే బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉన్నం మారుతీచౌదరి, చౌళం మల్లికార్జున, ఆర్జీ శివశంకర్, పాపంపల్లి రామాంజినేయులు, గొల్ల వెంకటేశులు, రామాంజినేయులు, కోల్లాపురప్ప, గోవిందు, లక్ష్మణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ బండి శేషన్న దంపతులను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కమిషనర్ బండి శేషన్న సేవలు మరువలేనివి

గుంతకల్లు : మున్సిపల్ కమిషనర్‌గా బండి శేషన్న చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కొనియాడారు. బండి శేషన్న బదిలీపై ధర్మవరం వెళ్తుండగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ భవానీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ భవనంలో వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనర్ శేషన్న విధి నిర్వహణలో గుంతకల్లు మున్సిపాలిటీకి అనేక సేవలు చేశారన్నారు. ముఖ్యంగా ఉదయం ఆరు గంటలకే వార్డుల్లోకి వెళ్లి కార్మికులు చేస్తున్న పారిశుధ్య పనులను పర్యవేక్షణ చేసేవారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ విశ్వనాథ్, అసిస్టెంట్ సిటీప్లానర్ కెఎండి.ఇస్సాక్, సహాయ కమిషనర్ మాలిక్, అసిస్టెంట్ ఇంజినీర్లు షబానా, శిరీషా, రెవెన్యూ అధికారి నాసిర్ హుస్సేన్, మెప్మా పట్టణ ప్రణాళిక అధికారి మోహన్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యాడికి ఎంపిడిఒగా లక్ష్మీనారాయణ

యాడికి : యాడికి ఎంపిడిఒగా లక్ష్మీనారాయణ సోమవారం తమ పదవీ బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. కాగా ఇంత వరకు ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు ఇఒఆర్‌డిగా కొనసాగుతారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆరుగురికి గాయాలు

ఘటనా స్థలంలో గాయపడిన వ్యక్తి..

ప్రజాశక్తి-బెలుగుప్ప

మండల పరిధిలోని నరసాపురం క్రాస్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. మరో ఆరుగురు తీవ్ర గాయాలకు గురయ్యారు. ఎస్ఐ రామకృష్ణయ్య తెలిపిన వివరాల మేరకు... నరసాపురం గ్రామానికి చెందిన పొట్ల వెంకటేశులు, మరో కొంతమంది సొంత పని నిమిత్తం ఆటోలో వస్తుండగా నరసాపురం క్రాస్ వద్ద రాగానే వెనుక నుంచి వచ్చిన టాటా మేజిక్ వ్యాను ఢీకొంది. దీంతో పొట్ల వెంకటేశులు (65) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడి వారిని చికిత్స కోసం కళ్యాణదుర్గం తరలించారు. మృతదేహాన్ని కళ్యాణదుర్గం ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా వెంకటేశులుకు భార్య పద్మావతి, ఇద్దరు కూతుళ్ల ఉన్నారు. ఇంటి పెద్దదిక్కు పోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు.

తహశీల్దార్లు బాధ్యతల స్వీకరణ

పెద్దవడుగూరు తహశీల్దార్ నాగభూషణం

పెద్దవడుగూరు : మండల తహశీల్దార్‌గా నాగభూషణం సోమవారం బాధ్యతలు చేపట్టాడు. ఆత్మకూరు మండల తహశీల్దార్‌గా పని చేసిన ఈయన బదిలీపై ఇక్కడకు రాగా ఇక్కడ పనిచేసిన తహశీల్దార్ ఈరమ్మ విడపనకల్లుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు, పలు సంఘాల సభ్యులు బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బెలుగుప్ప తహశీల్దార్ పీరాసాబ్

బెలుగుప్ప : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పీరాసాబ్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. అనంతరం ఎంపిపి పెద్దన్న, సింగిల్‌విండో అధ్యక్షులు శివలింగప్ప, తిప్పేస్వామి, వైసిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు, గుద్దేకుంట రామాంజనేయులు, జీడిపల్లి గాలి ఆంజనేయులు, నరిగన్న తిప్పేస్వామి, తదితరులు తహశీల్దార్‌ను సన్మానించారు.

సీనియర్ అసిస్టెంట్‌గా వెంకట్రామిరెడ్డి

శింగనమల : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ వెంకట్రామిరెడ్డిగా సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గార్లదిన్నె మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మంజుల పిఎబిఆర్‌కు బదిలీ అయ్యారు. అలాగే రాచేపల్లి వీఆర్వోగా నాగేంద్ర బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీనియర్ అసిస్టెంట్ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ మండలవ్యాప్తంగా ప్రజలు, రైతులకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

నార్పల వ్యవసాయ అధికారిగా చెన్న వీరాంజనేయులు

నార్పల : మండల వ్యవసాయ అధికారిగా చెన్న వీరాంజనేయులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ముస్తఫా సాధారణ బదిలీల్లో భాగంగా ధర్మవరానికి వెళ్లారు. ధర్మవరంలో విధులు నిర్వహిస్తున్న చెన్న వీరాంజనేయులను నార్పలకు బదిలీ చేయడంతో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల రైతులకు ఎల్లవేళలా అందుబాటు ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అదేవిధంగా స్థానిక వ్యవసాయ సిబ్బందిని సమన్వయంతో మండలంలోని అన్ని గ్రామాల్లో ఎప్పటికప్పుడు రైతులకు వ్యవసాయ సలహాలు, సూచనలు అందిస్తానన్నారు.

పలువురు అధికారుల బదిలీ

రాయదుర్గం రూరల్ : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న పలువురు అధికారులు బదిలీ అయ్యారు. రీసర్వే డిప్యూటీ తహశీల్దార్‌గా పని చేస్తున్న రఘు గుమ్మగట్ట మండలానికి బదిలీ అయ్యారు. అలాగే రాయదుర్గం అర్బన్ విఆర్‌ఒగా ఉన్న హరి బొమ్మనహాల్ మండలంలోని శ్రీధర్‌ఘట్టకు, బిఎన్‌హళ్లి విఆర్ఒ ముకుంద గుమ్మగట్ట మండలం తాళ్లకెరకు, చదం విఆర్వో మాంతేశ్ కలుగోడుకు బదిలీ అయినట్లు తహశీల్దార్ మారుతీ తెలిపారు. అలాగే బెలుగుప్ప నుంచి ఎర్రిస్వామి బిఎన్‌హళ్లి వీఆర్ఓగా, కంబదూరు నుంచి షబ్బీర్ హుస్సేన్, ఎర్రగుంట నుండి చిత్రయ్య రాయదుర్గం అర్బన్ విఆర్ఓలుగా బదిలీ చేసినట్లు తెలిపారు. రాయదుర్గం మండల పరిధిలో చదం, డి.కొండాపురం, మెచ్చిరి గ్రామాలకు వీఆర్వో పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

శ్మశానానికి దారి చూపాలని వినతి

తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ముస్లిములు

బొమ్మనహాల్ : మండలంలోని దేవగిరి గ్రామంలోని ముస్లిముల శ్మశానికి దారి చూపాలని పలువురు ముస్లిములు కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పదన కార్యక్రమంలో తమశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మైనారిటీ నాయకుడు బొంబాయి షర్మస్ మాట్లాడుతూ దాదాపు 20 ఏళ్ల నుంచి శ్మశానం ఉందన్నారు. అయితే శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలనుకుని ప్రయత్నిస్తే హద్దులు తెలియక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. కావున తమకు నాలుగు మూలలా హద్దులు ఏర్పాటు చేసి శ్మశానాన్ని అభివృద్ధి చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

వ్యవసాయ సహాయ సంచాలకులకు సన్మానం

గుత్తి : నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎడిఎ ఎం.వెంకటరాముడు, కనేకల్లు సీడ్ ఫామ్‌కు బదిలీపై వెళ్తున్న ఎడిఎ నారాయణనాయక్‌ను స్థానిక పట్టణంలోని సిఎల్ఆర్‌సి కార్యాలయంలో సోమవారం గుత్తిలో పలువురు ఘనంగా సన్మానించారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, ఎరువుల దుకాణదారులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గుత్తి, పామిడి మండలాల వ్యవసాయ అధికారులు ముస్తాక్ అహ్మద్, లీలా వసుంధర, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సహాయ సంచాలకులను సన్మానిస్తున్న సిబ్బంది

ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలి

ప్రజాశక్తి-శింగనమల

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులను అందించాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చిన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల పరిధిలోని సలకంచెరువులో ఉన్న రైతుభరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాల్లో పూర్తిస్థాయిలో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచామని అధికారులు చెబుతున్నా.. కనీసం 30 శాతం కూడా అందుబాటులో లేవన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన ఎరువులు, విత్తనకాయలు, పురుగు మందులు అందించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి టి.రామాంజినేయులు, సహాయ కార్యదర్శి మధుయాదవ్, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, నారప్ప, బయన్న, కుళ్లాయప్ప, కోనప్ప, రాజు, సాంబయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మసీదు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని ఉద్దేహాల్ గ్రామంలో నూతన మసీదు నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ముతువల్లి బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ గ్రామంలోని ముస్లింలందరూ కలిసి రూ.40, 50 అడుగుల నిర్మాణంతో చేయడానికి జమాత్ తీర్మానం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కణేకల్ సాహెబ్ జి మొహమ్మద్ ఖాద్రి, అబ్దుల్ మొహమ్మద్ ఖాద్రి, సినిమా హాల్ ఫక్రుద్దీన్, మాజీ ఎంపిటిసి ఎంసీ శర్ఫాన్, షబ్బీర్‌తోపాటు పలువురు ముతువల్లిలు, మసీద్ పెద్దలు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాన్ని తొలగించాలని వినతి

రాయదుర్గం : పట్టణంలోని దుగ్గిలమ్మ ఆలయ సమీపంలో ఉన్న సర్వేనెంబర్ 249లో రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్న అక్రమ కట్టడాన్ని తొలగించాలని సిపిఐ నాయకులు సోమవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షఫీ అను వ్యక్తి 20 అడుగుల రోడ్డును ఆక్రమించి నిర్మాణాన్ని చేపడుతున్నారన్నారు. దీనివల్ల ఆ ప్రాంతంలో నివాసం ఉన్న ప్రజల రాకపోకలకు అంతరాయం కలుగుతోందన్నారు. వెంటనే విచారించి అక్రమ కట్టడాన్ని తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు దుర్గన్న, గురుస్వామి, తిప్పేస్వామి, క్రొత్రేష్, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు వందనం

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మండల పరిధిలోని బాగినాయకనహళ్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి గొల్ల చంద్రకళ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత వాలంటీర్ల వ్యవస్థలను తీసుకొచ్చి సంక్షేమ పథకాలను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 50 కుటుంబాలకు ఒక వాలంటీర్ స్వయానా ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వాలంటీర్లను సత్కరించారు. తర్వాత ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రామాంజనేయులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎస్పీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని సిద్ధరాంపురం వద్ద ఉన్న పోలీస్ హౌసింగ్ లేఅవుట్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను పెంచి పరిరక్షించడం ద్వారానే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. కావున ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడంతోపాటు పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దాసరి సునీత, జడ్పిటిసి భాస్కర్, ఎంపిడిఒ విజయభాస్కర్, ఎపిఒ శ్రీదేవి, సర్పంచి కొండన్న, డీఎస్పీలు, సిఐలు, ఎస్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నార్పల : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల, పప్పూరు ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇష్టానుసారంగా చెట్లు నరుక్కుంటూ పోతే భవిష్యత్ తరాలకు అంధకారం తప్పదన్నారు. కావున ప్రతి ఒక్కరూ విధిగా బాధ్యతగా మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ ఈశ్వరయ్య, పోలీస్ సిబ్బంది దివాకర్, రాము, హరి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల రఘునాథరెడ్డి, డైరెక్టర్ శ్రీవాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సురయ, ఎన్ఎస్ఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా క్యూబ్ బయో ఎనర్జీ ప్రయివేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సోమవారం రాయదుర్గం కంపోస్టు యార్డులో

ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో వక్తలు

మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి, మున్సిపల్ డిఇ పి.సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ పారిశుధ్య కార్యదర్శులు, క్యూ బయో ఎనర్జీ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : మొక్కలు, పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం గుమ్మఘట్ట మండలం 75 వీరాపురం సమీపంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనకు ప్రాణవాయువును అందించే చెట్లను సంరక్షిస్తేనే మానవాళి మనుగడ సాధ్యమన్నారు. విద్యార్థి దశనుండే పిల్లలకు పర్యావరణంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతురెడ్డి, సర్పంచి నాగరాజు, కెపి.దొడ్డి నాగరాజు, రంగస్వామి, సత్తి, సంజీవ, బంజోబా, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుంతకల్లు డీఎస్పీ నర్సింగప్ప పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉరవకొండ అప్ గ్రేడ్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగమల్లి ఓబులేసు సహకారంతో వంద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి హాజరై డీఎస్పీ మాట్లాడుతూ మొక్కలే జీవకోటికి ప్రాణాధారమన్నారు. కావున ప్రతి ఒక్కరూ అవకాశం ఉన్నచోట మొక్కలు నాటి పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ హరినాథ్, ఎస్ఐ వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండి భావితరాలకు మంచి వాతావరణాన్ని అందించాలని సచివాలయ ఉద్యోగులు రామచంద్ర, ఉషారాణి, వెంకటస్వామి పిలుపునిచ్చారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని దిమ్మగుడిలో సుమంత్, ఎన్విరాన్‌మెంట్, రూరల్ అగ్రికల్చర్ సొసైటీ, సచివాలయ సిబ్బంది

మొక్క నాటి నీరు పోసిన ఎస్పీ శ్రీనివాసరావు

ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది సోమశేఖర్, అనిల్, కుళ్లాయిస్వామి, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మల్లేష్, ఐఒఆర్‌డి ఆనంద్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : భావితరాల ప్రజలు మనుగడ సాధించాలంటే చెట్లు అవసరమని తహశీల్దార్ ఉషారాణి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఎంపిడిఒ తేజోష్ణతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి : సమాజంలో పర్యావరణం కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఉమ్మడి రాష్ట్రాల హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ చంద్రకాంత్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండలంలోని నిజవల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ, సర్పంచి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కళాకారుడు, ఎస్‌కె ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు లెనిన్, సత్యసాయి జిల్లా అదనపు శైలజ, అనంతపురం మీనాక్షమ్మ, ఫౌండేషన్ అధినేత రవికాంతరమణ, మండల విద్యాశాఖ అధికారి ఓబుళపతి, అడ్వకేట్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నార్పల, గుత్తి, ఉరవకొండలో మొక్కలు నాటుతున్న దృశ్యం

'చలో మదనపల్లి' పోస్టర్లు విడుదల

గుత్తి : బహుజన్ సమాజ్ వాదీ పార్టీ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా మదనపల్లిలో చేపట్టిన బహుజన రాజ్యాధికార సభకు సంబంధించిన పోస్టర్లను గుత్తిలో సోమవారం విడుదల చేశారు. ముందుగా పట్టణంలోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి బిఎస్పీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ గుంతకల్లు నియోజకవర్గ అధ్యక్షులు విజయ్, కన్వీనర్ బి.వెంకట కొండయ్య, బిఎస్పీ నాయకులు ఎం.రామాంజనేయులు, ఎం.రంగనాయకులు, కె. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చలో మదనపల్లి పోస్టర్లను విడుదల చేస్తున్న బిఎస్పీ నాయకులు

ఆర్థికసాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

వైద్యానికి ఆర్థికసాయం

నార్పల : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని నడిమిదొడ్డి గ్రామానికి చెందిన కొంకా సూర్యనారాయణకు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి సోమవారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ఆర్థికసాయం అందించడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి మదమంచి ప్రతాప్‌చౌదరి, నాయకులు తిప్పన్న, రంగాపురం శ్రీరాములు, నరసాపురం శివరామకృష్ణ, ఆకుల లక్ష్మీనారాయణ, కొంకా ఆది, టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.